సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 18 । జూన్ । 2023

### ఎయిర్‌పోర్టులో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు

శంషాబాద్: అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్ భవనంలోని అంతర్భాగంలో శనివారం ఉదయం మంటలంటుకున్నాయి. ఇవి అలయన్స్ కార్యాలయం వరకు వ్యాపిస్తున్న క్రమంలో.. ప్రమాదాన్ని సూచిస్తూ అలారం మోగడంతో సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

### ఓయూలో 20న జరిగే పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో వివిధ కార్యక్రమాల దృష్ట్యా ఓయూ పరిధిలో ఈ నెల 20న జరగనున్న వివిధ కోర్సుల పరీక్షలు వాయిదా వేసినట్లు కంట్రోలర్ ప్రొ.రాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు.

### ఎల్లమ్మ రథోత్సవం నుంచి మిల్లెట్స్ లడ్డూ విక్రయాలు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణానికి వచ్చే భక్తులను 7 క్యూలైన్ల ద్వారా లోపలికి అనుమతిస్తారని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎస్.అన్నపూర్ణ తెలిపారు. కల్యాణం మరుసటి రోజు జరిగే రథోత్సవం నుంచి మిల్లెట్స్ లడ్డూ విక్రయాలను ప్రారంభిస్తామన్నారు.

## న్యూస్‌రీల్

### రేపు జిల్లాకు సీఎం కేసీఆర్ రాక



తుమ్మలూరు ఫారెస్టులో సీఎం మొక్కలు నాటే స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: దశాబ్ది వేడుకల్లో భాగంగా ఈ నెల 19న (సోమవారం) నిర్వహించే హరితహారం కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యం మంత్రి కేసీఆర్ జిల్లాకు రానున్నారు. మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం తుమ్మలూరులో మాక్ ప్రాజెక్ట్ ఎదురుగా నిర్వహించే హరితహారం కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఈ మేరకు శనివారం సాయంత్రం మంత్రి పి.సబితారెడ్డి సభాస్థలిని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి పరిశీలించారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాల్సిందిగా జిల్లా అధికారులను ఆదేశించారు.

### కూలీలకు ఉపాధి కల్పిస్తాం

డీఆర్‌డీఏ పీడీ ప్రభాకర్



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ ప్రభాకర్

ఇబ్రహీంపట్నం: కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పిస్తామని డీఆర్‌డీఏ పీడీ ప్రభాకర్ అన్నారు. రాయపోల్, ముకునూర్, దండుమైలారం గ్రామాల పరిధిలో కొనసాగుతున్న ఉపాధి హామీ పథకం పనులను క్షేత్ర స్థాయిలో శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం మండలంలో ఉపాధి కూలీల సంఖ్య బాగా తగ్గిపోయిందన్నారు. చెరువులు, కందకాల తవ్వకాల పనులు లేక కూలీల సంఖ్య తగ్గిందన్నారు. ఉపాధి హామి పథకం పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్, ఏపీఓ తిరుపతాచారి పాల్గొన్నారు.

### ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఆమనగల్లు: ప్రభుత్వాస్పత్రుల్లో డాక్టర్లు, వైద్య సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కో ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ డా.వరదాచార్యులు సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. అనంతరం డాక్టర్లు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని కోరారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆమనగల్లు సీహెచ్‌సీకి మందుల కొనుగోలుకు బడ్జెట్ కేటాయించినందున అవసరమైన మందులను నిల్వ ఉంచుకోవాలని సూచించారు. కుక్క కాటు, పాముకాటుకు సంబంధించిన వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారి డా.నాగరాజు, డా.జయశ్రీ, సిబ్బంది ఏసుమణి, ఇందిర, సునీత, కళమ్మ, శేఖర్, గోపాల్‌రెడ్డి, వెంకటయ్య, శ్రీను, సురేశ్, ఆనంద్, మంగ, శారద, సలీమ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ తనదైన 'ముద్ర'



గుడ్లపై ముద్రించిన ప్రత్యేక ముద్ర

**కోడిగుడ్ల పంపిణీ ప్రక్రియలో వినూత్న మార్పులు**

- పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు
- మూడు రంగుల్లో ముద్ర
- కమోడిటీ సప్లయ్ ట్రాకింగ్ విధానం ద్వారా సరఫరా
- గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ముద్రవేసిన గుడ్ల పంపిణీ

షాద్‌నగర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం కోడిగుడ్లను అందజేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ కోడిగుడ్లు పక్కదారి పడుతున్నాయన్న విమర్శల నేపథ్యంలో ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. లబ్ధిదారులకు మాత్రమే అందించేలా వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టింది. కోడిగుడ్లపై 'అంగన్‌వాడీ గుడ్లు తెలంగాణ ప్రభుత్వం' అని ప్రత్యేక ముద్ర వేసి పంపిణీ చేస్తోంది.

**పక్కదారి పట్టకుండా..**

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరే మూడేళ్లలోపు చిన్నారులకు ప్రభుత్వం బాలామృతం, గుడ్లు, ఆరేళ్లలోపు పిల్లలకు గుడ్లు, పప్పు, కూరగాయలు, భోజనం, కుర్‌కురే అల్పాహారం, పల్లిపట్టీలు, ఆరోగ్య లక్ష్మి పథకంలో భాగంగా ప్రతి రోజు అందిస్తున్నారు. బరువు తక్కువగా, బలహీనంగా ఉన్న వారికి రెట్టింపు పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందజేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే వారికి రోజుకు ఒకటి చొప్పున గుడ్డు ఉడికించి ఇస్తున్నారు. వివిధ కారణాలతో అందుబాటులో లేక ఎవరైనా కేంద్రాలకు రాకపోతే వారికి అందజేసినట్లు రికార్డుల్లో రాసుకొని దారి మళ్లిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇకపై ఎలాంటి అవకతవకలు జరగకుండా విడతల వారీగా ఒక్కో రంగుతో ముద్ర వేస్తున్నారు.

**మూడు రంగుల్లో..**

జూలై నుంచి ఫిబ్రవరి వరకు నెలకు రెండు విడతలుగా గుడ్లు అందిస్తారు. మార్చి నుంచి జూన్ వరకు వేసవిలో గుడ్లు త్వరగా పాడైపోయే ప్రమాదం ఉండటంతో నెలకు మూడు దఫాలుగా సరఫరా చేస్తారు. వేసవిలో అందించే గుడ్లపై నీలం, ఎరుపు, ఆకుపచ్చ రంగులు, చలికాలం, వర్షాకాలం అందించే గుడ్లపై ఎరుపు, ఆకుపచ్చ రంగులను ముద్రిస్తారు. ముద్ర మధ్యలో అంగన్‌వాడీ కేంద్రం ఏ జోన్ పరిధిలోకి వస్తుందో ఆ జోన్ నంబర్లను కూడా స్పష్టంగా కనిపించేలా 5మిల్లీమీటర్ల పొడవు, వెడల్పుతో ముద్రిస్తున్నారు. ప్రత్యేకమైన ముద్ర వేసిన ఈ గుడ్లనే ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**ట్రాకింగ్ సిస్టం ద్వారా సరఫరా**

అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేసే గుడ్లు పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కమోడిటీ సప్లయ్ ట్రాకింగ్ అనే ప్రత్యేక విధానం ద్వారా బ్యాచుల వారీగా సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ ముద్ర ఉన్న కోడిగుడ్లను కొనుగోలు చేసేందుకు వ్యాపారులు, ఇతరులు భయపడతారని, గుడ్ల అక్రమ రవాణా, వినియోగాన్ని ప్రాథమిక దశలోనే కట్టడి చేయొచ్చని, తద్వారా అసలైన లబ్ధిదారులకు మాత్రమే గుడ్లు అందజేసే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. జిల్లాలో ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,600 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 1,380 మెయిన్ అంగన్‌వాడీలు, 220 మినీ అంగన్‌వాడీలు ఉన్నాయి. మొత్తం 0 –6 ఏళ్లలోపు చిన్నారులు సుమారు లక్షా 42వేల మందికి పైగా ఉన్నారు. గర్భిణులు, బాలింతలు సుమారు 25వేల మంది ఉన్నారు.

**పారదర్శకంగా పంపిణీ**



అంగన్‌వాడీ కేంద్రాల్లో గుడ్లను మరింత పారదర్శకంగా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మూడు రంగుల్లో గుడ్లపై ముద్రను వేసి సరఫరా చేస్తున్నారు. దీంతో గుడ్లు పక్కదారి పట్టేందుకు అవకాశం ఉండదు.

– నాగమణి, సీడీపీఓ, షాద్‌నగర్

# రెవెన్యూలో కుదుపు

- చర్చనీయాంశంగా 'సాక్షి' కథనాలు
- హియరింగ్ వాయిదా వేసిన ఆర్డీఓ
- అర్కపల్లిలో బాధితుల ఆందోళన



అర్కపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితుల ధర్నా

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా రెవెన్యూశాఖలో సాక్షి కథనాలు దుమారం రేపుతున్నాయి.రెండు రోజులుగా ప్రచురిస్తున్న కథనాలు సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి. కొంగరకలాన్ సర్వే నంబర్ 249/2 నుంచి 249/17 వరకు ఉన్న భూముల విక్రయాలు, కొనుగోలు వ్యవహారంలో చోటు చేసుకున్న అక్రమాలపై శుక్రవారం 'భూ మాయాజాలం' శీర్షికన ప్రచురించిన కథనం రెవెన్యూ అధికారులకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లో గ్రీన్‌జోన్‌లో ఉన్న భూములను రెసిడెన్షియల్ జోన్‌గా మార్చిన వైనంపై విజిలెన్స్, సీసీఎల్‌ఏ, నిఘా వర్గాలు ఆరాతీసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ అంశంపై ప్రభుత్వానికి అంతర్గత నివేదిక కూడా అందజేసినట్లు సమాచారం.

**తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా**

మాడ్గుల మండలం అర్కపల్లి రెవెన్యూ పరిధిలోని ఆంజనేయ స్వామి దేవాలయం పేరున ఉన్న భూములకు ఆర్డీఓ ఓఆర్‌సీ జారీ చేసిన అంశంపై 'హనుమా..భూ మాయ కనుమా' శీర్షికన శనివారం ప్రచురితమైన కథనం రెవెన్యూ అధికారులను ఉక్కిరి బిక్కిరి చేసింది.ఈ కేసు నుంచి తప్పించుకునేందు కు రెవెన్యూ అధికారులు శతవిధాలా ప్రయత్ని స్తున్నట్లు తెలిసింది. మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించాల్సిన 'హియరింగ్'ను సైతం సాయంత్రం ఐదు గంటలకు పొడగించడమే ఇందుకు నిదర్శనం. సరైన సాక్ష్యాధారాలతో రావాల్సిందిగా ఇరు పార్టీలకు సూచిస్తూ వాయిదా వేసినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే సర్వే నంబర్ 95లోని గ్రామ కంఠం భూమిపై వివాదం కొనసాగింది. బాధితులు, భూమిని కొనుగోలు చేసిన రైతులకు మధ్య గలాటా జరిగింది. ఇరు వర్గాలు ఒకరిపై మరొకరు దాడులు చేసుకున్నారు. రెవెన్యూ అధికారుల తీరును నిరసిస్తూ బాధితులు ఇటు పోలీసు స్టేషన్, అటు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగడం విశేషం.

# రూ.120 కోట్లతో గ్రంథాలయాల అభివృద్ధి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి

యాచారం: జిల్లాలో రూ.120 కోట్ల నిధులతో గ్రంథాలయాలను అభివృద్ధి చేయనున్నట్లు, పోటీ పరీక్షలకనుగుణంగా అందుబాటులో అన్ని రకాల పుస్తకాలు ఉంచేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. యాచారంలోని గ్రంథాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఎన్ని రకాల పుస్తకాలు ఉన్నాయి, నిత్యం పాఠకులు ఎంత మంది వస్తున్నారు, యువతకు కావాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉంటున్నాయా, వసతులు ఎలా ఉన్నాయి అని ఆరా తీశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో గ్రంథాలయాలకు గుర్తింపు తెచ్చే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. శేరిలింగంపల్లిలో రూ. 3 కోట్లు, కొందుర్గులో రూ. కోటి, ఇబ్రహీంపట్నంలో రూ. 80 లక్షల నిధులతో గ్రంథాలయాల్లో అదనపు గదులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 20న విద్యా దినోత్సవం సందర్భంగా గ్రంథాలయాల్లో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత కోసం కావాల్సిన పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని, అవసరమైతే ప్రత్యేక గదులు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు జంగమ్మ, యాచారం పీఏసీఎస్ చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నాయకులు చిన్నోళ్ల యాదయ్య, సాయిలు పాల్గొన్నారు.

# గిరిజనాభివృద్ధి ఘనత మాదే

- మంత్రి సబితారెడ్డి



గిరిజన మహిళలకు స్వయంగా భోజనం వడ్డిస్తున్న మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని ఉప్పుగడ్డ తండా డబుల్ బెడ్‌రూమ్స్ పక్కన గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం గిరిజన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రంలో గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో బంజార భవన్, ఆదివాసీ భవన్ నిర్మాణం, కుమ్రం భీం జయంతి, సేవాలాల్ మహరాజ్ జయంతి, సమ్మక్క సారక్క జాతరకోసం భారీగా నిధులు వెచ్చిస్తోందని, వివిధ జాతరలకు ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. గిరిజన తండా గ్రామ పంచాయతీలలో రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలు, గ్రామ పంచాయతీ భవనాలు, వీధి దీపాలు, వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాలు, నర్సరీలు, ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్‌ల కొనుగోలు, పలు మౌలిక వసతులు కల్పించిందన్నారు. రాష్ట్రంలో పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు 6 నుంచి 10 శాతం పెంచడం వంటి విప్లవాత్మక నిర్ణయాల ద్వారా గణనీయమైన మార్పునకు నాంది పలికారని తెలిపారు. మహేశ్వరంలో రూ.2 కోట్ల నిధులతో గిరిజన బంజార భవన్ నిర్మాణానికి నిధులు, సంత్ సేవాలాల్ ఆలయ నిర్మాణానికి రూ. కోటి రూపాయాలు నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించామన్నారు. ఇంద్రారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో సుమారు రెండెకరాల విస్తీర్ణంలో రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా సంత్ సేవాలాల్ ఆలయం నిర్మిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు గిరిజన మహిళలకు మంత్రి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వయంగా భోజనం వడ్డించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి రామేశ్వరి దేవి, కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్, మీర్‌పేట్ కార్పొరేషన్ మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, ఎంపీపీ కొరుపోలు రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీ సునితా అంధ్యా నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఆనందం, మాజీ జెడ్పీటీసీ ఈశ్వర్‌నాయక్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు లచ్చా నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్, తహసీల్దార్ మహమూద్ అలీ, ఎంపీడీఓ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# అద్దెకున్న వాడే హతమార్చాడు

- ఆభరణాల కోసమే హత్య
- జంట హత్యల కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన శంషాబాద్ డీసీపీ నారాయణ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ నారాయణ రెడ్డి

నందిగామ: వృద్ధురాలు, మనవరాలు జంట హత్యల కేసును పోలీసులు ఛేదించారు. శంషాబాద్ డీసీపీ నారాయణ రెడ్డి శనివారం నందిగామ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నందిగామకు చెందిన ఏర్రగారి పార్వతమ్మ(65)కు వారసులు లేరు. సొంతింట్లో ఉంటూ సమీపంలోని బండకుంట తండా అంగన్‌వాడీలో ఆయాగా పనిచేస్తోంది. ఆమెకు తోడుగా మనుమరాలు (చెల్లెలు కొడుకు కృష్ణయ్య కూతురు) భానుప్రియ (9) ఉంటోంది. నాయనమ్మతోనే ఉంటూ స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. ఈ నేపథ్యంలో పార్వతమ్మ ఇంట్లో ఓ గది ఖాళీగా ఉండటంతో బీహార్ రాష్ట్రం జాముల్ జిల్లా జహాజా గ్రామానికి చెందిన దివాకర్ సాహూ (23) భార్య అంజలీ దేవితో కలిసి 4 నెలల క్రితం అద్దెకు దిగారు. దివాకర్ స్థానిక ఎంఎస్‌ఎన్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తుండగా, అతడి భార్య మరో పరిశ్రమలో పనిచేస్తోంది. భార్యాభర్తలు తరచూ గొడవ పడుతుండటంతో పార్వతమ్మ వారిని వారించి వారం రోజుల క్రితం గదిని ఖాళీ చేయించింది. దీంతో ఆ దంపతులు అదే గ్రామంలో మరో ఇంట్లో అద్దెకున్నారు.

**ఆభరణాలపై కన్నేసి..**

గదిని ఖాళీ చేయించిందనే కోపంతో పాటు పార్వతమ్మకు ఎవరూ లేరని గమనించిన సాహూ పార్వతమ్మ ధరించిన బంగారు ఆభరణాలపై కన్నేశాడు. ఎలాగైనా మట్టుపెట్టి వాటిని కొట్టేయాలని ప్రణాళిక రచించాడు. అదనుకోసం ఎదురుచూస్తున్నాడు. గురువారం రాత్రి భోజనం చేసిన అనంతరం పార్వతమ్మ, ఆమె మనమరాలు భానుప్రియ ఇంట్లోని వరండాలో నిద్రపోయారు. అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 1.30 గంటల సమయంలో దివాకర్ సాహూ గుట్టు చప్పుడు కాకుండా గేటు దూకి ఇంట్లోకి ప్రవేశించాడు. పార్వతమ్మ గొంతు నులిమి తలపై ఇటుకతో దాడి చేశాడు. దీంతో ఆమె స్పృహ కోల్పోగా, భానుప్రియ లేచి అరవడానికి ప్రయత్నించడంతో పక్కనే ఉన్న ఇటుకతో తలపై కొట్టి, కత్తితో గొంతు కోసి చంపేశాడు. అనంతరం పార్వతమ్మ దగ్గరున్న సంచిలో నుంచి బీరువా తాళాలు తీసుకొని బీరువా తెరిచి అందులోని సుమారు నాలుగు తులాల బంగారు పుస్తెల తాడు, బంగారు వంకు, వెండి కాలి పట్టాలు, రూ.వెయ్యి నగదు దోచుకొని వెళ్లిపోయాడు. తన కూతురు ఇంటికి రాలేదని భానుప్రియ తల్లి శుక్రవారం రాత్రి పార్వతమ్మ ఇంటికి వెళ్లి చూడగా ఈ దారుణం వెలుగులోకి వచ్చింది.

**5 గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు**

విషయం తెలిసిన ఇన్‌స్పెక్టర్ రామయ్య ఆధ్వర్యంలో పోలీసుల బృందం హంతకుడి కోసం పలు కోణాల్లో దర్యాప్తు ప్రారంభించింది. దివాకర్ సాహూపై అనుమానం వచ్చి అతడు ఉంటున్న ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. అతడి కోసం గ్రామంలో వెతుకుతుండగా బైపాస్ రోడ్డు పక్కన తెల్లవారుజామున కనపడటంతో పట్టుకొని విచారించగా నేరం అంగీకరించాడు. అతడి నుంచి, నగలు నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ఆదేశానుసారం రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో శంషాబాద్ ఏసీపీ భాస్కర్ గౌడ్, ఇన్‌స్పెక్టర్ రామయ్య, పోలీసుల బృందం పాల్గొన్నారు. కేసును 5 గంటల్లో ఛేదించిన ఇన్‌స్పెక్టర్ రామయ్యను డీసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

# గిరిజనుల అభ్యున్నతికి కృషి

- కలెక్టర్ హరీశ్

ఆమనగల్లు: ప్రభుత్వం ఆరోగ్య మహిళా పథకం కింద ప్రతి మంగళవారం ఎంపిక చేసిన ప్రభుత్వాస్పత్రుల్లో ప్రత్యేకంగా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ హరీశ్ తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం రూ.2 కోట్లతో నిర్మించే గిరిజన భవన్ నిర్మాణానికి కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, కలెక్టర్ హరీశ్ శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని, ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వం గిరిజనాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు అనురాధ పత్యానాయక్, దశరథ్‌నాయక్, మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్‌లు, రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు జీఎల్‌ఎన్‌రెడ్డి, తహసీల్దార్ జ్యోతి, మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, గిరిజన నాయకులు పత్యానాయక్, దశరథ్‌నాయక్, లచ్చిరాంనాయక్ పాల్గొన్నారు.



ఆమనగల్లులో జరిగిన సభలో మాట్లాడుతున్న కలెక్టర్ హరీశ్

**బోరుమోటార్ల పంపిణీ**

కడ్తాల్: గిరిజనుల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండల పరిధిలోని వాస్‌దేవ్‌పూర్‌లో గిరిజన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌తో పాటు కలెక్టర్ హరీశ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామానికి చెందిన 8 చెంచు కుటుంబాలకు వ్యవసాయ బోర్ మోటార్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, ఇన్‌చార్జి తహసీల్దార్ వినోద్, ఎంపీడీవో రామకృష్ణ, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, ఎంఈవో సర్దార్, ఏపీఎం రాజేశ్వరి, ఏవో శ్రీలత పాల్గొన్నారు.

# కాలం చెల్లిన విత్తన డబ్బాల స్వాధీనం

## నిందితుడి అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు



కాలం చెల్లిన బీట్‌రూట్ విత్తనాల డబ్బా

**చేవెళ్ల:** రైతులకు కాలం చెల్లిన కూరగాయల విత్తనాలు విక్రయిస్తున్న వ్యక్తిని ఎస్‌ఓటీ పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించి స్థానిక పోలీసుల సహకారంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన చేవెళ్లలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం వివరాలు.. మండల కేంద్రంలోని షాబాద్ చౌరస్తాలో హైదరాబాద్‌లోని యాకత్‌పూరా, జమల్ మసీద్ ఇమ్లిబాన్‌కు చెందిన సయ్యద్ మహమూద్ తాహెర్ ఒక బాక్సులో సకాట కంపెనీ పేరిట ఉన్న 52 బీట్‌రూట్ 250 గ్రాముల కాలం చెల్లిన డబ్బాలతో బస్సు కోసం ఎదురు చూస్తుండగా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 52 బీట్‌రూట్ డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 80 డబ్బాల్లో 28 డబ్బాలు రైతులకు విక్రయించినట్లు గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తలించారు. ఈ దాడుల్లో వ్యవసాయ శాఖ అధికారి తులసి, చేవెళ్ల, ఎస్‌ఓటీ పోలీసులు పాల్గొన్నారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న కాలంచెల్లిన విత్తన డబ్బాలు

# రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

**ఇబ్రహీంపట్నం రూరల్:** కొత్త బైక్ రిజిస్ట్రేషన్ చేయించడానికి వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కృష్ణయ్య కథనం ప్రకారం.. వడ్డెర రమేష్, నాగరత్న దంపతులు ఇటీవల కొత్త బైక్ కొనుగోలు చేశారు. ఉదయం 11 గంటల సమయంలో రాగన్నగూడ సమీపంలో రోడ్డు క్రాస్ చేసి మన్నెగూడ ఆర్‌టీఏ కార్యాలయం వైపు వెళ్తుండగా హైదరాబాద్ నుంచి ఇబ్రహీంపట్నం వైపు వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నాగరత్నకు కాలు, తలకు గాయాలయ్యాయి. సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నారు.

# గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**షాద్‌నగర్ రూరల్:** గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మున్సిపల్ పరిధిలోని సోలీపూర్ శివారులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ రాంచందర్ కథనం ప్రకారం.. సోలీపూర్ శివారులోని రైల్వే బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి(55) మృతదేహం ఉన్నట్లుగా గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలియరాలేదు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండడంతో మూడు రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు రైలు లోనుంచి పడి ఉండవచ్చని, లేకుంటే ట్రాక్ దాటే క్రమంలో ప్రమాదానికి గురయి ఉండొచ్చనే అనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రాంచందర్ తెలిపారు. మృతుడి ఆచూకీ లభించినా, వివరాలు తెలిసినా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు.